# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

# ప్రాంతీయ వార్తా విభాగం

# ప్రాంతీయ వార్తలు

తేది : 07 -01-2026 సమయం : 1.20 గంటలు

## ముఖ్యాంశాలు

1. విహంగ వీక్షణం ద్వారా పోలవరం ప్రాజెక్టును పరిశీలించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు.
2. రాజధానిలో రెండవ విడత భూ సమీకరణకు భూములు ఇచ్చే రైతులకు రుణమాఫీ చేస్తామన్న పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి నారాయణ.
3. బాలికల సంక్షేమం, ఆరోగ్యం, భద్రత అంశాలకు ప్రాధాన్యతనిస్తున్నామన్న మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి.
4. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్న నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి.
5. సంక్రాంతి పండుగకు అదనంగా 8 వేల 432 ప్రత్యేక బస్సులను నడపనున్న ఏపీఎస్ఆర్టీసీ.

-----------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఏలూరు జిల్లాలో ఈరోజు పర్యటిస్తున్నారు. దీనిలో భాగంగా విహంగ వీక్షణం ద్వారా స్పిల్ వే సహా మొత్తం పోలవరం ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం ప్రాజెక్ట్ లోని కాఫర్ డ్యామ్, గ్యాప్ 1, గ్యాప్ 2, కుడి కాలువ పనుల అభివృద్ధి వివరాలను మంత్రి నిమ్మల రామానాయుడు ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే నిర్మాణం చివరి దశకు చేరుకున్న డయాఫ్రమ్ వాల్ను కూడా ముఖ్యమంత్రి పరిశీలించారు. సంబంధిత అధికారులతో పోలవరం నిర్మాణ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తున్నారు.

----------------------

రాష్ట్రంలో భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ NHAI నిర్మిస్తున్న బెంగళూరు-కడప-విజయవాడ ఎకనామిక్ కారిడార్ -NH-544G రెండు గిన్నిస్ రికార్డ్ లను సాధించిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. 24 గంటల్లో 28.95 కిలోమీటర్ల మేర 10 వేల 675 మెట్రిక్ టన్నుల బిటుమినస్ కాంక్రీట్ వేయడం ద్వారా ఈ రికార్డ్ లు పొందాయని ఈ రోజు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలిపారు. ఈ విజయం ప్రపంచ స్థాయి జాతీయ రహదారుల మౌలిక సదుపాయాలపై కేంద్ర ప్రభుత్వ దార్శనికతను నిరంతర కృషిని, ఇంజనీర్లు, కార్మికుల అసాధారణ నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

----------------------

రాజధాని రెండో విడత భూసమీకరణకు భూములు ఇచ్చే రైతులకు లక్ష 50 వేల రూపాయల వరకు రుణమాఫీ చేస్తామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి నారాయణ తెలిపారు. రాజధాని అమరావతిలో రెండో విడత భూ సమీకరణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా తుళ్లూరు మండలం వడ్డమాను గ్రామంలో స్థానిక శాసనసభ్యులు శ్రవణ్ కుమార్ తో కలిసి ఈరోజు రైతుల నుంచి అంగీకారపత్రాలను మంత్రి స్వీకరించారు. అనంతరం నారాయణ పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ సెకన్లు

----------------------

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారిని మారిషస్ అధ్యక్షులు ధరమ్ బీర్ గోకుల్ కుటుంబ సమేతంగా ఈ రోజు దర్శించుకున్నారు. ఆలయ మహద్వారం వద్ద దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టిటిడి ఛైర్మన్ బి.ఆర్.నాయుడు, మారిషస్ అధ్యక్షుడికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో స్వామివారి తీర్థప్రసాదాలను, చిత్రపటాలను అందజేశారు. అంతకుముందు భూదేవి సమేత వరాహస్వామివారిని ఆయన దర్శించుకున్నారు.

----------------------

బాలికల సంక్షేమం, ఆరోగ్యం, భద్రత అంశాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. గుంటూరులో సామాజిక పరివర్తన బాలికల

కళాశాల వసతి గృహాన్ని ఆయన నిన్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థినులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ, వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సంక్షేమం, సౌకర్యాలు అందిస్తున్నామన్నారు. వసతి గృహాల మరమ్మతులకు 203 కోట్ల రూపాయలు, 29 నూతన వసతిగృహాల భవనాలకు 105 కోట్ల రూపాయాలను కేటాయించామని వివరించారు.

-----------------------

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఉపాధి భద్రత కల్పించేందుకు వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ ఆజీవికా మిషన్ గ్రామీణ్ -వీబీ జీ రామ్ జీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ అన్నారు. విబిజి రామ్ జీ పథకం పై విశాఖపట్నంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ,

వాయిస్..25 సెకన్లు

-----------------------

మెరుగైన ప్రభుత్వ పాలన, సకాలంలో సంస్కరణల అమలు కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న Pro-Active Governance and Timely Implementation-ప్రగతి 50వ సమావేశాన్ని విజయవంతంగా పూర్తిచేసుకుని ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకుంది. కీలకమైన మౌలిక

సదుపాయాల ప్రాజెక్టులలో జాప్యానికి కారణమయ్యే సమస్యలను పరిష్కరించడంలో ప్రగతి సహాయపడింది. ఇందులో భాగంగా హిమాచల్ ప్రదేశ్‌లోని పర్బతి-II జలవిద్యుత్ ప్రాజెక్టు పురోగతికి ప్రగతి సమావేశం ఎలా దోహదపడిందో ఈ రోజు తెలుసుకుందాం.

పర్బతి-II జలవిద్యుత్ ప్రాజెక్టు హిమాచల్ ప్రదేశ్‌లోని కులు జిల్లాలోని పర్బతి నదీ ప్రవాహం ఆధారంగా నడిచే జలవిద్యుత్ కేంద్రం.ఇది ఉత్తరాది గ్రిడ్‌కు విద్యుత్ ను సరఫరా చేయడం ద్వారా బహుళ రాష్ట్రాలకు ప్రయోజనం చేకూరుస్తుంది. అయితే, ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి భూ సేకరణ, పాలనా పరమైన అనుమతులు గణనీయమైన సవాళ్లను ఎదుర్కొంది. ఈ విషయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2016 ఫిబ్రవరి 17న ప్రగతి సమావేశంలో సమీక్షించారు. ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని ప్రధానమంత్రి హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించారు. దీంతో నాలుగు ఉత్పత్తి యూనిట్లలో మూడు గత సంవత్సరం ఏప్రిల్ 1న వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించాయి. ఈ విధంగా మౌలిక సదుపాయాల అభివృద్ధి, అమలులో ప్రభుత్వ ప్రాధాన్యతకు ప్రగతి యంత్రాంగం నిదర్శనంగా నిలుస్తోంది.

-----------------------

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సూచించారు. నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశంలోరాజ్యసభ సభ్యులు బీదా

మస్తాన్ రావుతో కలసి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి.. మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో ఉపయోగించి డ్రోన్ పరికరాల కొనుగోలుకు కేంద్రప్రభుత్వం 80శాతం రాయితీ ఇస్తోందని తెలిపారు.

-----------------------

రహదారి నిబంధనలను పాటిస్తూ ప్రమాదాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీ శ అన్నారు. 37వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా వివిధ కళాశాలల విద్యార్థులతో విజయవాడలో నిర్వహించిన వాక్ థాన్ ను కలెక్టర్ ఈరోజు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

వాయిస్..30 సెకన్లు

-----------------------

సంక్రాంతి పండుగకు రద్దీ దృష్ట్యా అదనంగా 8,432 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఏపీఎస్ఆర్టీసీ ఒక ప్రకటనలో వెల్లడించింది. స్త్రీశక్తి పథకం దృష్ట్యా ఈసారి రాష్ట్రంలో పలు ప్రాంతాల మధ్య ప్రత్యేక బస్సుల ఏర్పాటులో ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపింది. ఇతర రాష్ట్రాల్లోని హైదరాబాద్, బెంగళూరు, చెన్నై ప్రాంతాలకు 2,432 ప్రత్యేక బస్సు సర్వీసులు కేటాయించామని, రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు 3500 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని పేర్కొంది. ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ ఛార్జీలే ఉంటాయని, దూర ప్రాంతాలకు నడిచే ప్రత్యేక బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ సదుపాయం కల్పించినట్లు తెలిపింది.

-----------------------

భారతీయ భాషలను బలోపేతం చేయడానికి, ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో దేశంలోని వివిధ ప్రాచీన భాష అధ్యయన పీఠాలు ప్రచురించిన తెలుగు, తమిళం, ఒడియా, మలయాళం, కన్నడ సాహిత్య సంపుటాలను ఆయన నిన్న విడుదల చేశారు.

= = = = = = = = = = = = = = =